నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల
వనపర్తి
5 | మహబూబ్‌నగర్, బుధవారం 28 ఆగస్టు 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



గద్వాల మండలం జంగంపల్లిలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

# కానరాని పారిశుద్ధ్యం

- పల్లెల్లో కొరవడిన పరిశుభ్రత
- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు
- నిధులులేక నీరసించిన గ్రామ పంచాయతీలు
- బ్లీచింగ్ పౌడర్ కొనేందుకు కూడా డబ్బులు లేని వైనం..
- సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు

గద్వాల, ఆగస్టు 27 : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం కేసీఆర్ సర్కారు కృషి చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలను పట్టించుకోవడం మానేసింది. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం మచ్చుకైనా కనిపించడం లేదు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని నానుడి. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి అటకెక్కింది. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రజలకు పాలన అందించేందుకుగానూ ప్రత్యేక అధికారులతోపాటు కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలలు కావస్తున్నా గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పారిశుధ్య పనులు చేసేందుకు ఇటు కార్యదర్శులు, అటు ప్రత్యేకాధికారులు ముందుకు రావడంలేదు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 255 జీపీలు ఉండగా..



గద్వాల మండలం వీరాపురంలో రోడ్లపై పారుతున్న మురుగునీరు

అందులో సగం కంటే ఎక్కువ గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రధాన రహదారులపై మురుగునీరు వదిలినా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. దవాఖానలకు రోగుల తాకిడి పెరిగింది.

**నిధుల కొరతతో సతమతం..**

బీఆర్ఎస్ సర్కారు హయాంలో నిధులు విడుదల చేయడంతో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పల్లెప్రగతి, పట్టణప్రగతి పేరిట పనులు చేపట్టేవారు. దీంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు దాదాపుగా కనుమరుగయ్యాయి. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది. పెద్ద జీపీలు మినహా చిన్న గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో సతమతమవుతున్నాయి. నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమం నిర్వహించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోయింది. కనీసం మురుగునీరు నిలిచిన చోట, డ్రైన్‌ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా నిధులు లేకపోవడంతో కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. బ్లీచింగ్ పౌడర్ కూడా సొంతంగా కొనుగోలు



గద్వాల మండలంలో అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

చేయాల్సి వస్తున్నదని కార్యదర్శులు వాపోతున్నారు.

**ప్రత్యేకాధికారులు ఉన్నా ఫలితం శూన్యం..**

సర్పంచుల పదవీకాలం ముగియడంతో రెండు, మూడు గ్రామ పంచాయతీలకు కలిపి ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. అయితే, వారు ఏనాడూ గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న దాఖలాలు లేవు. దీంతో వారి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. ఇక భారమంతా పంచాయతీ కార్యదర్శులపై మోపడంతోపాటు నిధులు లేకపోవడంతో వారు కూడా చేతులెత్తేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రోడ్లపైకి మురుగునీరు వచ్చి చేరుతున్నది. డ్రైనేజీలను కూడా శుభ్రం చేయకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్సీ కవిత విడుదల కావడంతో హన్వాడ మండలం కిష్టంపల్లిలో కూలీలకు స్వీట్లు పంచుతున్న బీఆర్ఎస్ నేతలు

# బీఆర్ఎస్ సంబురాలు

- ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో హర్షాతిరేకాలు
- పటాకులు కాల్చి.. స్వీట్లు పంచిపెట్టిన నేతలు
- అడుగడుగునా ఘనస్వాగతం పలుకుతామని వెల్లడి

ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్‌ను మంజూరు చేయడంతో బీఆర్ఎస్ నేతలు సంబురాలు చేసుకున్నారు. మంగళవారం జిల్లాకేంద్రాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో పటాకులు కాల్చి.. స్వీట్లు పంచిపెట్టారు. బీజేపీ ప్రభుత్వం ఆధారాలు లేని కేసులో ఇరికించి పైశాచిక ఆనందం పొందిందని పలువురు నేతలు వ్యాఖ్యానించారు. కడిగిన ముత్యంలా తిరిగివచ్చిన ఎమ్మెల్సీ కవితకు అడుగడుగునా ఘనస్వాగతం పలుకుతామని వెల్లడించారు. చివరికి న్యాయమే అంతిమ విజయం సాధించిందన్నారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, ఆగస్టు 27

**కేంద్రానికి చెంపపెట్టు లాంటిది : చిట్టెం**



మక్తల్, ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యం లాగా బయటికి వచ్చేందుకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేంద్రానికి చెంపపెట్టు లాంటిదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన నమస్తే తెలంగాణతో ఫోన్‌లో మాట్లాడారు. కేసీఆర్‌ను అణగదొక్కాలనే వక్రబుద్ధితో కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను లిక్కర్ స్కాంలో దోషురాలిగా చూపుతూ జైలులో ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ ఆడపడుచు అయిన కవితకు స్వాగతం పలికేందుకు యావత్ ప్రజానీకం సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభు త్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని కేసీఆర్‌ను భయపెట్టాలని చూసిందని, కానీ ఆయన ఎవరికీ భయపడే వ్యక్తి కా దన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ ఒక శక్తి అని పేర్కొన్నారు. చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తికి చెందిన కుటుంబీకులపై అక్రమ కేసులు పెట్టి జైల్‌లో పెట్టాలని చూడడం తగదన్నారు. బీజేపీకి చెడురోజులు రాకతప్పదన్నారు.

**స్వాగతిస్తున్నాం : రాజేందర్‌రెడ్డి**



నారాయణపేట, ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐదు నెలలపాటు అక్రమంగా జైల్‌లో పెట్టినా ఒక్క ఆధారం కూడా చూపెట్టలేకపోయారన్నారు. సాక్ష్యాలు లేకుండా ఆరోపించిన నేర ఆదాయాన్ని రికవరీ చేయకుండా.. కేవలం ఆమోదించే వారి ప్రకటనలు, అంచనాల ఆధారంగా అరెస్ట్ చేయడం చూస్తుంటే రాజకీయ ప్రతీకార చర్య తప్పా మరొకటి కాదన్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని పేర్కొన్నారు.

**అక్రమ కేసులు నిలవలేవు : బీరం**



కొల్లాపూర్, ఆగస్టు 27 : న్యాయస్థానం ఎదుట ఎమ్మెల్సీ కవితపై పెట్టిన అక్రమ కేసులు నిలవలేవని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం హర్షణీయమన్నారు. అక్రమ కేసులో ఆధారాలు లేకుండా అరెస్టు చేసి జైలుకు తరలించారన్నారు. చివరికి న్యాయమే గెలిచిందన్నారు. కొత్త ఉత్తేజంతో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

# 64మందికి రెండు బాత్రూంలేనా..?

- డోర్లు విరిగిపోవడంతో తీవ్రమైన దోమల బెడద
- మెనూ ప్రకారం అందని భోజనం
- యన్మన్‌గండ్ల బాలికల హాస్టల్ తనిఖీలో అవాక్కయిన తాసీల్దార్



హాస్టల్‌లో బాలికలతో మాట్లాడుతున్న తాసీల్దార్

నవాబ్‌పేట, ఆగస్టు 27 : 64 మంది బాలికలకుగానూ రెండు బాత్రూంలే ఉండడంతో తాసీల్దార్ అవాక్కయ్యారు. నవాబ్‌పేట మండలంలోని యన్మన్‌గండ్ల బాలికల కళాశాల హాస్టల్‌ను తాసీల్దార్ నాన్యనాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని పరిస్థితులను చూసిన తాసీల్దార్, డీటీ గాయత్రి, ఎంపీవో భద్రనాయక్ షాక్‌కు గురయ్యారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ హాస్టల్ అద్దె భవనం పూర్తిగా శిథిలావస్థలో అపరిశుభ్రంగా ఉందన్నారు. డోర్లు విరిగిపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉన్నదని, కనీసం ఆల్‌ఔట్ వంటి ఏర్పాట్లు కూడా చేయలేదన్నారు. మెనూ ప్రకారం భోజనం కూడా వడ్డించకపోవడమేమిటని ప్రశ్నించారు. వార్డెన్ సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. వీటన్నింటిపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని తెలిపారు. కాగా, విద్యార్థులకు త్వరలోనే తన సొంత నిధులతో దుప్పట్లు, డోర్ రిపేర్లు, అవసరమైన సామగ్రి సమకూరుస్తానన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సుష్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎండను సైతం లెక్కచేయకుండా..



అమరచింత యూనియన్ బ్యాంకు ఎదుట బారులుదీరిన రైతులు

- బ్యాంకు, వ్యవసాయ కార్యాలయాలకు క్యూకట్టిన రుణమాఫీకాని రైతులు
- పోలీసుల మధ్య విధులు నిర్వర్తించిన బ్యాంకు అధికారులు

అమరచింత, ఆగస్టు 27 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ జాబితాల్లో పేర్లు ఎందుకురాలేదని అడిగేందుకు మంగళవారం రైతన్నలు బారులుదీరారు. ఎండను సైతం లెక్కచేయకుండా బ్యాంకుల ఎదుట క్యూ కట్టారు. మూడు రోజుల సెలవు తరువాత తెరుచుకోవడంతో అమరచింత మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంకుకు, వ్యవసాయ కార్యాలయానికి మంగళవారం రైతులు భారీగా తరలివచ్చారు. తమకు ఎందుకు లబ్ధి చేకూరలేదో సమాధానం చెప్పే వరకు ఎండను కాదు కదా.. వర్షాన్ని సైతం లెక్కచేయమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి 40 రోజులు గడిచినా.. ఇంకా డబ్బులు జమ కావడం లేదని, ఒక్క అమరచింత మండలంలోనే వేల సంఖ్యలో బాధితులు ఉన్నారన్నారు. ఇప్పటికైనా ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని కోరుతున్నారు. కాగా, మంగళవారం బ్యాంకు అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య విధులు నిర్వర్తించారు.

# స్వచ్ఛత.. ఉత్తమాటే!



ఆరుబయటే మూత్రవిసర్జన చేస్తున్న సిబ్బంది

- పాలమూరు మున్సిపాలిటీలో కొరవడిన పారిశుధ్యం
- నీటి సౌకర్యం లేక శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు
- వినియోగంలో లేని మొబైల్ టాయిలెట్ వాహనం
- నిత్యం అధికారులు కొలువయ్యే చోటే అపరిశుభ్రత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 27 : కాంగ్రెస్ సర్కారు చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం కేవలం ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలకే సరిపోయింది. కానీ ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. 'పరిసరాల పరిశుభ్రత మనందరి కర్తవ్యం.. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.. ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ మలమూత్ర విసర్జనను ఉపేక్షించేది లేదు..' అంటూ నిత్యం ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు. కానీ వారు విధులు నిర్వర్తించే చోటే అపరిశుభ్రత రాజ్యమేలుతున్నది. ప్రజల నుంచి వివిధ రకాలైన పన్నులు వసూలు చేయడంపై ఉన్న ధ్యాస.. కార్యాలయానికి వచ్చే వారికి మౌలిక వసతులు కల్పించకపోవడం విడ్డూరం. నీటి సౌకర్యం లేకపోవడంతో మరుగుదొడ్లను వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. కార్యాలయం ఆరుబయటే మలమూత్ర విసర్జన చేస్తున్నారు. స్త్రీల కోసం ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్ వా హనం ఉన్నా ఉపయోగం లేకుండా పో యింది. ఇదంతా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం గురించే.. అక్కడ మచ్చుకైనా పారిశుధ్యం కనిపించడం లేదనడానికి ఈ చిత్రాలే నిదర్శనం.. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి సిబ్బంది, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉన్నది.



మహబూబ్‌నగర్‌లో నీటి సౌకర్యం, పర్యవేక్షణ లేక అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్ ప్రాంతం



నీటి సౌకర్యం లేని మూత్రశాలలు



జడ్చర్లలోని గంజ్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

# పదిరోజులుగా.. ఎక్కడి చెత్త అక్కడే..

- జడ్చర్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

జడ్చర్ల, ఆగస్టు 27 : జడ్చర్ల మున్సిపాలిటీలోని 16వ వార్డులో పది రోజులుగా ఎక్కడి చెత్త అక్కడే పడి ఉన్నది. స్టేట్‌బ్యాంకు ఏరియా, గంజ్, శివాజీనగర్ ప్రాంతాల్లో చెత్తను తొలగించకపోవడంతో కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. చెత్తకుప్పల్లోనే కుళ్లిన వ్యర్థాలు కూడా వేయడంతో దుర్వాసన వెదజల్లుతున్నదని కాలనీవాసులు చెబుతున్నారు. చెత్తను తొలగించాలని కౌన్సిలర్ లలిత మున్సిపల్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. మంగళవారం జడ్చర్ల మున్సిపాలిటీలో బోనాల పండుగ ఉన్నా.. చెత్తను తొలగించకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే డ్రైనేజీలో చెత్త పేరుకుపోవడంతో దానిని తొలగించేందుకు జేసీబీని పంపించాలని కోరినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని కౌన్సిలర్ లలితానాగరాజు తెలిపారు.

# షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

- నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో రైతు సంఘం నాయకుల ధర్నా

నాగర్‌కర్నూల్, ఆగస్టు 27 : ఎలాంటి షరతుల్లేకుండా వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ రాష్ట్ర వ్యాప్తంగా 55 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ అందలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తామని ప్రకటించగా.. బడ్జెట్‌లో కేవలం రూ.26 వేల కోట్లు కేటాయించి.. అందులోనూ రూ.17, 933 కోట్లను మాత్రమే మాఫీ చేసిందన్నారు. ఇంకా రూ.13 వేల కోట్లను అందజేయాల్సి ఉందన్నారు. మాఫీ చేసిన అనంతరం రైతులకు కొత్త రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంటిసాకులు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దేశ్యానాయక్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్, మాలిక్, తిరుపతిరెడ్డి, బాలరాజు, రైతు సంఘం నాయకులు కుర్మయ్య, కార్తీక్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

**రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి..**

నారాయణపేట టౌన్, ఆగస్టు 27 : రేషన్‌కార్డు నిబంధనను తొలగించి అర్హులందరికీ రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి అంజిలయ్యగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో జిల్లాలో చాలామంది రైతులు రుణమాఫీ అమలుకు నోచుకోలేకపోతున్నారన్నారు. రుణమాఫీ కోసం విడుదల చేసిన జీవో 567ను సవరించాలన్నారు. ధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలరాం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలప్ప మద్దతు తెలిపారు. అనంతరం ధర్నా శిబిరం వద్దకు వచ్చిన తాసీల్దార్ అమరేందర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు మహేశ్‌కుమార్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో వినతిపత్రం అందజేస్తున్న నేతలు



నారాయణపేటలో ఆందోళన చేస్తున్న నేతలు



వనపర్తి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

**కాలయాపన తగదు..**

వనపర్తి టౌన్, ఆగస్టు 27 : ఇంటింటికి వచ్చి విచారణ చేస్తామని చెప్పి కాలయాపన చేయడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాబర్ట్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2 లక్షలకు పైగా ఉన్న అప్పును చెల్లిస్తేనే మాఫీ చేస్తామని ఆంక్షలు పెట్టడం తగదన్నారు. పేర్లు తప్పుగా ఉన్నాయని, రేషన్‌కార్డు లేదన్న నెపంతో తప్పించుకోవాలని చూడడం దారుణమన్నారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల కూడా చాలా మందికి లబ్ధి చేకూరలేదన్నారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి.. ఇండ్లకు వెళ్లి విచారణ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. అది ఆచరణలో అమలు కావడం లేదన్నారు. ప్రతి మండలంలో వందలకొద్ది రైతులు దరఖాస్తులు చేస్తున్నారన్నారు. అసైన్‌మెంట్ భూములకు కూడా రుణాలివ్వాలన్నారు. రైతు భరోసా కింద ఏటా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని, వానకాలం సీజన్ ముగిసినా ఇప్పటివరకు వాటి ఊసెత్తడం లేదన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఎం.నగేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు రమేశ్, శ్రీహరి, గోపాలకృష్ణ, మహేశ్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.